క్లుప్తంగా

నేడు రాంలీలా

చొప్పదండి: పట్టణంలోని క్రీడా మైదానంలో రాంలీలా ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయదశమిని పురస్కరించుకొని ఏటా విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాంలీలా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవం పురస్కరించుకొని సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తలతో హిందూ సాంప్రదాయాలపై ప్రసంగం, చివరగా చెడుపై మంచి విజయానికి సంకేతంగా బాణాసంచా పేలుస్తుంటారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య రాంలీలా నిర్వహిస్తామన్నారు. వివిధ పాఠశాలల సాంస్కృతిక ప్రదర్శనలుంటాయన్నారు. సాయంత్రం జరిగే ఉత్సవానికి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

జమ్మికుంట: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని టౌన్ సీఐ వరంగంటి రవి అన్నారు. మున్సిపల్ పరిధి, మోత్కులగూడెంలో శుక్రవారం సాయంత్రం పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు పొనగంటి మల్లయ్య బిట్ల మోహన్, పొనగంటి విజయలక్ష్మిమల్లయ్య, సారంగం, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఏవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనవసరమైన గొడవలకు తెరలేపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దసరా సందర్భంగా అందరికీ విజయాలు చేకూరాలని శుభాకాంక్షలు తెలిపారు.

వాహన పూజకు ఏర్పాట్లు పూర్తి

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద వాహనపూజకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో మారుతి శుక్రవారం తెలిపారు. ఆలయం వాహన పూజకు ఎంతో ప్రసిద్ధి. ఏటా దసరా రోజున వాహన పూజలు జోరుగా సాగుతాయి. అన్నిరకాల వాహనాలను పూజ కోసం ఇక్కడికి తీసుకొస్తారు. పదిహేను మంది పూజారులు సిద్ధంగా ఉంటారని, ఆలయం వద్ద టెంట్లు, భారీకేడ్లు, నీటివసతి కల్పిస్తామన్నారు. భక్తుల రద్దీ కారణంగా సాధారణ పూజలు ఉంటాయని, ఉదయం నాలుగు గంటల నుంచే పూజలు ప్రారంభమవుతాయని, ఉదయం శమీపూజ కూడా నిర్వహిస్తామని, ఆలయం వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసు బందోబస్తు ఉంటుందని ఈవో తెలిపారు.

లింగమూర్తికి నివాళి

చిగురుమామిడి: ముప్పై ఏళ్లుగా ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ విధుల్లోనే రాకం లింగమూర్తి మృతి చెందడం బాధాకరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. చిగురుమామిడిలో లింగమూర్తి చిత్రపటానికి శుక్రవారం పూలమాలవేసి నివాళి అర్పించారు. గ్రామంలో ఇటీవల మృతిచెందిన దున్నపోతుల ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ స్వామి, లక్ష్మి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాజ య్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, చిన్నస్వామి, సదా శివ, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, జంపయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం రాములపల్లికి చెందిన వర్షిత్‌రెడ్డి, నందిని శుక్రవారం సాయంత్రం హుజూరాబాద్ వచ్చారు. బస్టాండ్ సమీపంలో ఆటో దిగి, కరీంనగర్–వరంగల్ ప్రధాన రోడ్డు దాటుతుండగా హుజూరాబాద్ వైపు వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పెట్టుబడి పైపైకి..

- రోజురోజుకూ సాగు భారమవుతుందని వాపోతున్న అన్నదాతలు
- యంత్రలక్ష్మి పథకం అమలు చేస్తే కష్టాలు గట్టెక్కినట్టే
- ఈజీఎస్‌ను వ్యవసాయరంగానికి అనుసంధానం చేస్తే మరింత మేలు



కాట్రపల్లి గ్రామంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: వ్యవసాయరంగంలో నానాటికి పెరుగుతున్న పెట్టుబడిని నియంత్రించి అధిక దిగుబడి సాధించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ ఎంతగానో దోహదం చేస్తోంది. సాగు విధానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అన్నదాతలు అందిపుచ్చుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సాగును ప్రోత్సహించే క్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమల్లోకి తీసుకురాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా అమలుకు హామీ ఇచ్చింది. దీనికి యంత్రలక్ష్మి తోడైతే చాలా వరకు కష్టాలు గట్టెక్కినట్లే. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానిస్తామని చేసిన ప్రకటన కార్యరూపం దాలిస్తే మరింత మేలు జరుగుతుందని రైతులు ఆశపడుతుఆన్నరు.. పెరుగుతున్న పెట్టుబడి తలకు మించిన భారంగా మారుతుందని, ఏ పంటను సాగు చేయాలన్నా ఎకరాకు కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని, యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటే కూలీల ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. యాంత్రీకరణ పథకానికి నిధుల కొరత పీడిస్తోంది. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో వ్యవసాయ పనులన్నీ ఒకేసారి రావడం కూలీల సమస్య కంటి మీద క నుకు లేకుండా చేస్తోంది. హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం సుమారు 30 వేల ఎకరా ల్లో వరి సాగవుతుంది. వానాకాలం సీజన్‌లో రైతులు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి రైతువేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు చేశారు.

విజ్ఞానయాత్రలు లేవు

ఎక్కడైనా పంటలో అధిక దిగుబడి సాధిస్తే గతంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులను ఆయా ప్రాంతాలకు శాఖ తరపున తీసుకెళ్లేది. అక్కడి రైతులతో మాట్లాడించడం, సాగులో పాటించిన పద్ధతులు కళ్లారా చూయించేది. అలాంటి వాటికి వ్యవసాయశాఖ పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టింది. కొందరు రైతులు సొంత ఖర్చులతో వెళ్లి చూసి రావాల్సి వస్తోంది. ఇప్పటికైనా విజ్ఞానయాత్రలను కొనసాగించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఇలా చేస్తేనే మేలు

తక్కువ ఖర్చుతో ఎక్కువ రాయితీతో కూడుకున్న యంత్ర పరికరాలను అవసరం ప్రధానంగా డీజిల్‌తో పనిచేసే కలుపు నివారణయంత్రాలు పంపిణీ చేయాలి. నాగుళ్లు, రొటోవేటర్లు, దమ్ము యంత్రాలు, విత్తనాలు, ఎరువులు ఒకేసారి వేసే గొర్రు అందించాలి. పంట నూర్పిళ్ల సమయంలో టార్పాలిన్లు అందజేయాలి. విజ్ఞాన యాత్రలను పునరుద్ధరించాలి. ఆధునిక సాగు పట్ల రైతు వేదికల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.

రాయితీపై పరికరాలివ్వాలి



రాయితీ పరికరాలతో రైతులకు ప్రయోజనకరం. పదేళ్లుగా వాటి పంపిణీ నిలిచిపోయింది. దీంతో రైతులపై అదనంగా ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికే సాగు చేసేందుకు పురుగుమందు, ఎరువులు, ఇతరత్రా కొనుగోళ్లు భారంగా మారింది. కొత్త ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను పంపిణీ చేయాలి.

– గూడూరి మల్లారెడ్డి, రైతు, ఇప్పలనర్సింగాపూర్

ఆర్థిక భారమవుతోంది



వ్యవసాయరంగంలో రోజురోజుకి ఖర్చులు పెరిగిపోతున్నాయి. సాగులో యంత్ర పరికరాల వినియోగం సైతం భారీగా పెరిగిపోయింది. వాటిని కొనుగోలు చేయాలంటే ఆర్థికభారం అవుతోంది. సాగురంగాన్ని ప్రోత్సాహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందజేసేందుకు కృషి చేయాలి.

– వంగల వెంకట్‌రెడ్డి, రైతు, సిర్సపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



రైతువేదికల ద్వారా శాస్త్రవేత్తలతో రైతులకు ఆధునిక పద్ధతుల్లో వివిధ పంటల సాగును వివరిస్తున్నాం. ఏఈవోల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రైతులకు యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందిస్తే మరింత మేలు జరుగుతుంది. ప్రభుత్వం మంజూరు చేసే అవకాశం ఉంది.

– సునీత, ఏడీఏ, హుజూరాబాద్





శంకరపట్నం: కొత్తగట్టులో మండపం వద్ద హోమం, మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో బోనాలు



జమ్మికుంటలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

ప్రత్యేక పూజలు, హోమం


జమ్మికుంట: మున్సిపల్ పరిధి, మండలంలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ మండపాల్లో దుర్గామాతకు వేద పండితులు కిషోరాచార్యులు వేద మంత్రోచ్ఛరణల మధ్య శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హౌజింగ్‌బోర్డు కాలనీలోని దుర్గామాత మహిషసుర మర్దినిదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నసీరొద్దీన్ అనే ముస్లిం భక్తుడు దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో చీర సమర్పించాడు. సాయంత్రం మహిళలు సామూహిక లలితాపారాయణం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో దుర్గామాత మండపాల వద్ద భక్తులు పూజలు చేశారు. కొత్తగట్టు దుర్గామాతకు శుక్రవారం మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో హోమం, బోనాల కార్యక్రమం నిర్వహించారు.

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో శ్రీభవానీమాత మండపం వద్ద హోమం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం అర్చకులు గంగు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పదమంది పుణ్యదంపతులు హోమంలో పాల్గొన్నారు. ఏటా దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్నేహమిత్ర ఆధ్వర్యంలో యూత్ సభ్యులు దైవిక కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఇనుగాల కిష్టారెడ్డి, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, యూత్ సభ్యులు గంజి శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు, కిరణ్, పరుశరాములు, రాజేందర్, ఓదెలు, హరీశ్, సతీస్, శివప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



చిగురుమామిడి: లంబాడిపల్లిలో హోమం



జమ్మికుంట: పట్టణంలోని 30వ వార్డులో ఐసీఐసీఐ బ్యాంక్ ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ కోసం సంపు నిర్మించి రోజులు గడుస్తున్నా.. పైకప్పు వేయడం మరిచారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు సంపులోకి చేరింది. మంచినీటి సరఫరాలో కలుషిత నీరు కలిసే అవకాశం ఉందని, ప్రజలు వ్యాధుల బారినపడతారని, సంపులోని నీటిని తొలగించాలని కోరుతున్నారు. పండుగల వేళ ప్రజలు సంపులో పడిపోకుండా పైకప్పు వేసి ప్రమాదాలు జరగకుండా, తాగునీరు కలుషితం కాకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎండీ అయాజ్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 89787 78080

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

గూడ్స్‌వ్యాన్ అసోసియేషన్



అసోసియేషన్ నూతన కార్యవర్గం

గంగాధర: నాలుగు మండలాల గూడ్స్‌వ్యాన్ అసోసియేషన్ సమావేశాన్ని శుక్రవారం మండలంలోని మధురానగర్‌లో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గంగాధర, రామడుగు, కొడిమ్యాల, బోయినిపల్లి మండలాలకు చెందిన గూడ్స్ వ్యాన్ యజమానులు అసోసియేషన్ అధ్యక్షుడిగా నేరెళ్ల కిషన్, కార్యదర్శిగా గుంటుకు రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పొన్నం శేఖర్, కోశాధికారిగా తూడి అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా కదారి సంపత్,షేక్ కాశిం, పల్లాటి శంకర్, రేగుల మల్లేశం, సింగసాని రాజేశం ఎన్నికయ్యారు.

15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రామడుగు: మండలంలో ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నామని మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 15, 16న రామడుగు, దత్తోజీపల్లి, 17న శ్రీరాములపల్లి, కిష్టాపూర్, 18, 19న షానగర్, 21న కొక్కెరకుంట, దత్తోజీపేట, 22న దత్తోజీపేట, 23న రుద్రారం, 24న రంగసాయిపల్లి, 26న మోతె, వన్నారం, 28,29న పందికుంటపల్లి, 30న చిప్పకుర్తి, 31, నవంబర్1న రాంచంచెంద్రాపూర్, 4,5న గుండి, 6,7న గోపాల్‌రావుపేట, 7న వెదిర, 8న లక్ష్మీపూర్, 9న కోరటపల్లి, 11న వెంకట్రావుపల్లి, 12న వెలిచాల, 13,14న తిర్మలాపూర్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తామని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

బాలయ్యకు సన్మానం



బాలయ్యను సన్మానిస్తున్న సంఘం నాయకులు

గన్నేరువరం: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన పురంశెట్టి బాలయ్యను శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్ ఆధ్వర్యంలో మైలారం గ్రామంలో సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొట్టె భూమయ్య, బొడ్డు బాలయ్య, పుల్లెల రాము, గొల్లపల్లి రవి, కొట్టె రవి, కొట్టె నర్సయ్య, గొల్లపల్లి రవి, తోట రాజు, కయ్యం సంపత్, వరాల సత్తయ్య, వరాల గంగయ్య, వరాల జగన్ పాల్గొన్నారు.

నియామకం

గన్నేరువరం: రాష్ట్ర బేడ బుడగజంగాల హక్కుల దండు వ్యవస్థాపక ఇన్‌చార్జిగా మండల కేంద్రానికి చెందిన టేకు అనిల్ నియామకమయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల రాజలింగం శుక్రవారం నియామక పత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆలోచనా విధానాలతో నడుస్తూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిరిగిరి తిరుపతి, పత్తి అంజి, రాజయ్య, చంద్రయ్య, లింగమూర్తి, పోచయ్య, సంపత్ పాల్గొన్నారు.



జమ్మికుంట: ఆత్మీయ సమ్మేళనంలో 2008-09 టెన్త్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జమ్మికుంట/శంకరపట్నం: జమ్మికుంట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాకతీయ స్కూల్ 2008–09 పదో తరగతి విద్యార్థులు, శంకరపట్నం మండలం కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003–2004 పదో తరగతి విద్యార్థులు మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మాంచారు. జమ్మికుంటలో ముఖ్య అతిథిగా కాకతీయ విద్యా సంస్థల అధినేత అవిర్నేని సుధాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, టౌన్ సీఐ వరంగంటి రవి హాజరయ్యారు. శంకరపట్నం కార్యక్రమంలో కోరెం కొండాల్‌రెడ్డి, సంతోష్, రాము, సుధాకర్‌రెడ్డి, బాబు, సుష్మిత, కోమల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నం: ఉపాధ్యాయులతో 2003-04 విద్యార్థులు

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు రెండో విడుత నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మొదటి విడుత కింద విడుదలైన నిధులతో షాపులు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులకు రెండో విడుత నిధులు విడుదల చేస్తే చేయూతనందించినట్టు అవుతుందన్నారు. నిధులను గత ప్రభుత్వం విడుదల చేయకపోడంతో ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. నిధుల విడుదలకు పార్టీ తరఫున నిరాహార దీక్ష చేయనున్నామని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్, నాయకులు రాకేశ్, రవి కిరణ్, సదానందం, రాజు, శ్రీకాంత్, సురేశ్, చంద్రశేఖర్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాయకులు నరేశ్, రాకేశ్, రవికిరణ్, సదానందం, రాజు తదితరులు

తరచూ అంతరాయంతో అవస్థలు

గన్నేరువరం: గుండ్లపల్లి స్టేజీలోని ఎస్‌బీఐ ఏటీఎం సేవల్లో తరచూ అంతరాయం ఏర్పడుతుందని, నిరంతరం ప్రజలు వినియోగించుకునే చూడాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం ఏటీఎం వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఏటీఎం సేవలు రోజులుగా నిలిచిపోతున్నాయని, పండగుల సమయంలో ప్రజలు డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో యువజన నాయకులు మొలుగూరి ఆంజనేయులు, స్థానికులు కురుమెల్లి రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో మాట్లాడుతున్న సీపీఐ గన్నేరువరం మండల సహాయ కార్యదర్శి శ్రీశైలం, తదితరులు

భాగ్యనగర్ విజయ్‌కుమార్‌కు నివాళి

హుజూరాబాద్‌రూరల్: కరీంనగర్ జీవగడ్డ సాయంకాల దినపత్రిక ఎడిటర్ భాగ్యనగర్ విజయ్‌కుమార్ వర్ధంతి శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ చిత్రపటానికి మిత్ర బృందం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ తోట రాజేంద్రప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు చందా గాంధీ, పీవీ జిల్లా సాధన సమితి అధ్యక్షులు భీమోజు సదానందం, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు పలకల ఈశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం వెలుగుల రత్నం ,సైదాపూర్ మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకటరాజ్యం, పులి జగన్నాథం, వేల్పుల ప్రభాకర్, ద్రావిడ మహాసభ కన్వీనర్ రామ్‌రాజేశ్వర్, శనిగరపు భాస్కర్ ఉన్నారు.

రైస్‌మిల్లు నిర్మించొద్దు

గన్నేరువరం: గన్నేరువరం శివారులో రైస్‌మిల్లు నిర్మించొద్దని స్థానికులు డిమాండ్ చేశారు. రైస్‌మిల్ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దుమ్ము ధూళితో పాటు పొగతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు పనిచేయడానికి వస్తారని వారితో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని, ఇటీవల గొడవ సైతం జరిగిందన్నారు. రైస్‌మిల్ వద్ద వెళ్లే దారి ఇరుక్కుగా ఉంటుందని, ఎదురుగా వాహనం వెళ్లలేని పరిస్థితి ఉందని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఇతర సుడా అధికారులను కలిసి సమస్య వివరించామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, ఎల్లారెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, చైతన్యరెడ్డి, మనోహర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, అరుణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'కి సన్మానం



గన్నేరువరం: మానకొండూర్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయించి, భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కేడీసీసీబీ డైరెక్టర్ అలువాల కోటి, తెలంగాణ టీచర్స్, లెక్చరర్ ఫోరం మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి రమేష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.